తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




# తోతాపురికి గిట్టుబాటు ధర

**మ్యాంగో బోర్డు ఏర్పాటుకు కృషి**

**మామిడి రైతులతో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీ, ఎమ్మెల్యేలు సమావేశం**



**తోతాపురి మామిడి గిట్టుబాటు ధరపై ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతినిధులు, రైతులతో సమావేశమైన కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.**

చిత్తూరురూరల్, మే 22 ప్రభాతవార్త:

జిల్లాలో మామిడి సాగు అధికంగా వుండటంతో అత్యధికంగా పండే తోతాపురి రకం మామిడికి గిట్టుబాటు ధర కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లు మామిడి రైతులు, ప్రాసెసింగ్ యూనిట్ల యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ జిల్లాలో మామిడి బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, జిల్లాలో మామిడి సాగు అధికంఆ వుండటంతో ప్రాసెసింగ్‌కు అవసరమైన తోతాపురి రకం ఎక్కువగా పండించడం జరుగుతున్నదన్నారు. మామిడి రైతుకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో మామిడి బోర్డు ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సంబంధిత శాఖలకు అందించడంతో పాటు కేంద్ర మంత్రి దృష్టికి ఈ విషయంను తతీసుకెళ్ళడం జరిగిందన్నారు. ఇటు రైతులు, అటు ప్రాసెసింగ్ కంపెనీల యాజమానులు ఇద్దరికి న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. యూరోపియన్ దేశాల్లో మామిడి ఎగుమతికి సమస్య వుందని ప్రాసెసింగ్ కంపెనీల యాజమానులు చెప్పగా ప్రస్తుత పరిస్థితుల్లో ఈ విషయంపై ఏమి చేసే అవకాశం లేదని ఎంపీ పేర్కొన్నారు. యూరోపియన్ దేశాలకు ఎగుమతి చేసే మామిడి గుజ్జు, జ్యూస్‌లపై దిగుమతి సుంకం తగ్గింపుకు మినిస్టర్ ఆఫ్ కామర్స్ వారిని కోరడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడుకు మామిడి రైతుల కష్టాలు తెలుసునని రైతుల కష్టాలు తీర్చే బాధ్యత సిఎం తీసుకుంటారన్నారు. ఉద్యానశాఖ డైరెక్టర్ మాట్లాడుతూ జ్యూస్‌లపై జిఎస్టీ ఎత్తివేతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఈ విషయంను సిఎం తీసుకెళ్ళడం జరిగిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మామిడి సీజన్‌లో తోతాపురి గిట్టుబాటు ధర విషయంలో రైతులు, ప్రాసెసింగ్ కంపెనీలు సమన్వయం ఎంతో అవసరమన్నారు. తోతాపురి రకం మామడికి గిట్టుబాటు ధర కల్పించే విషయంలో రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులతో పాటు ప్రాసెసింగ్ యూనిట్ల వారు సైతం పరిశ్రమలు నిర్వహించడానికి అనుగుణంగా ఇద్దరికీ సామరస్యంగా వుండేలా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ మామిడి రైతుకు న్యాయం జరిగేలా ప్రాసెసింగ్ కంపెనీల యాజమానులతో చర్చించి ముందుకు వెళ్ళాలన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ జిల్లాలో తోతాపురి మామిడి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, శాస్త్రీయ పద్ధతిలో మామిడిపై అధ్యాయనం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మామిడి సీజన్ వచ్చినపుడు కాకుండా వాస్తవ పరిస్థితులను దృష్టిలో వుంచుకుని దూరదృష్టితో సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేయాలన్నారు. తమిళనాడు ప్రభుత్వం మామిడి రైతులకు మద్దతు ధర ప్రకటించే దిశగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ తోతాపురి రకం మామిడితో పాటు ఇతర వెరైటీల సాగుపై దృష్టి పెట్టడం లేదని, రైతులు ఆ దిశగా ఆలోచించాలన్నారు. ప్రాసెసింగ్ యూనిట్ల యాజమానులు మాట్లాడుతూ ఫ్యాక్టరీల్లో ఇప్పటికే ఎక్కువ గుజ్జు నిల్వ వున్నదని, గుజ్జుకు ప్రస్తుతం డిమాండ్ తగ్గిందని దీనికి పలు కారణాలు వున్నాయన్నారు. డొమెస్టిక్ మార్కెట్‌లో వినియోగదారుల ఆలోచనపై ఈ అంశం ఆధారపడి వుందని, వినియోగదారులు ఎక్కువగా ఎనర్జీ డ్రింక్స్ పట్ల ఆకర్షితులు కావడంతో మామిడిలో షుగర్ లెవల్స్ వున్నాయని, వీటి వినియోగం తగ్గుతున్నదని, ఈ విషయం తమను ఆందోళనకు గురి చేస్తోందన్నారు. రైతులు దశల వారీగా కోతలు కోస్తే కంపెనీలు సైతం సరైన ధర అందించడానికి అవకాశం వుంటుందన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ మోహన్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల ఉద్యానశాఖ అధికారులు మధుసూధన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, రవిచంద్రబాబులు, మామిడి ప్రాసెసింగ్ యూనిట్ యాజమానులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రసన్నాంజనేయుని ఆశీస్సులతో శుభాలు కలగాలి

**-టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి**

తిరుమల,మే 22ప్రభాతవార్త ప్రతినిధి:



హనుమజ్జయంతిని గురువారం మధ్యాహ్నం తిరుపతికి వెళ్ళే మొదటి ఘాట్ లోని 7వ మైలువద్ద ప్రసన్నాంజనేయస్వామి నిలువెత్తు విగ్రహానికి ఆలయ అర్చకులతో కలసి అదనపు ఈఓ చిరుమామిళ్ళవెంకయ్యచౌదరి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఘాట్‌రోడ్డులో, నడకదారిలో స్వామివారి అభయంతోనే భక్తులు సురక్షితంగా ఉన్నారని అదనపు ఈఓ వెంకయ్యచౌదరి తెలిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, విఎస్‌ఓ వింగ్ ఎస్టీవిరామ్‌కుమార్,అర్చకులు పాల్గొన్నారు.

# హనుమంతుని అనుగ్రహం అందరిపై కలగాలి

## కొండపై ఆంజనేయస్వామికి విశేష అభిషేకాలు

తిరుమల,మే 22 ప్రభాతవార్తప్రతినిధి:

వైశాఖమాసం దశమిరోజు హనుమజ్జయంతి వేడుకలు తిరుమలలో వైభవంగా జరిగాయి. గురు వారం ఉదయం నుండి సాయంత్రం వరకు కొండపై ఆంజనేయస్వామి ఆలయాలు జైశ్రీరామ్ నినాదంతో మార్మోగాయి. అంజనాద్రిలో వెలసిన "బాలాంజనేయస్వామి ఆలయంలో బాలాంజ నేయునికి, అంజనాదేవికి"అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు బాలాంజ నేయస్వామిని దర్శించుకుని ఆశీస్సు లందుకున్నారు.



పాపవినాశనం మార్గంలో జపాలి తీర్థంలో కొలువైన ఆంజనేయస్వామికి హనుమజ్జయంతిన టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు,టిటిడి అదనపు ఈఓ చిరుమామాళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం టిటిడి తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న బేడి ఆంజనే యాస్వామి ఆలయంలో స్వామివారికి వేదమంత్రోచ్ఛరణలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ పూజల్లో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం,ఈఓ సతీమణి ,భక్తులు పాల్గొన్నారు.

**సంక్షేమ వసతి గృహాలలో**

# మెరుగైన వసతుల కల్పనే లక్ష్యం

## జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్



చిట్టమూరు, మే 22, ప్రభాతవార్త

ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ బడులకు పెద్దపీట వేస్తుందని ఇందుకుగాను పెద్ద ఎత్తున నిధులు సమకూర్చి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం చిట్టమూరు మండల కేంద్రంలోని స్వర్గీయ మార్కండేయలనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని మరుగుదొడ్లు, స్నానపు గదులు విద్యార్థులు పడుకునే గదులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో కోట్ల రూపాయలను సంక్షేమ వస్తు గృహాలు, ప్రభుత్వ బడుల అభ్యున్నతికి కేటాయిస్తుందన్నారు. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం 10 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందన్నారు. చిట్టమూరు మండల కేంద్రంలోని వసతి గృహం అభివృద్ధి, మరుగుదొడ్ల నిర్మాణం,మంచినీరు,వంటి అవసరాలకు గాను సుమారు 14 లక్షలు రూపాయలను వెచ్చించి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వ విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించాలంటే వారు ఆరోగ్యంగా ఉండాల్సి న అవసరం ఉందని, దీన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం వసతి గృహాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. గడచిన కాలంలో సంక్షేమ వసతి గృహాలలో 60 శాతం వరకు మరుగుదొడ్లు త్రాగునీరు సౌకర్యాలు సక్రమంగా ఉండేవి కాదని, దీనివలన విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురై డెంగ్యూ,మలేరియా వంటి వ్యాధులు బారిన పడుతున్నారని గుర్తించామన్నారు. అంతకు మునుపు జిల్లా కలెక్టర్‌కు మండల తెదేపా కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ప్రకృతి విభాగ సిబ్బంది పుష్పగుచ్చాల అందించి స్వాగతం పలికారు. స్థానిక మండల అధికారులతో పాటు తెదేపా నాయకులు గోపాల్ నాయుడు, అరవపాలెం సర్పంచి రాజేష్ రెడ్డి, గుండు బోయిన కస్తూరయ్య, మేరగల మధు చిట్టమూరు, మల్లం వసతిగృహ వార్డెన్లు సాల్మన్‌రాజు,మహేంద్రలు పాల్గొన్నారు.

# రేపు కుప్పానికి సిఎం చంద్రబాబు రాక

**- 25న సొంతింటి గృహప్రవేశంకు హాజరు !!**

కుప్పం, మే 22 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఈనెల 24వతేది కుప్పంకు విచ్చేస్తున్నారు. 25వతేది తాము నిర్మించుకున్న సొంతింటి గృహప్రవేశ కార్యక్రమంలో కుటుంబసమేతంగా పాల్గొంటారు. శాంతిపురం మండల ం కదిరి ఓబనపల్లి వద్ద సిఎం చంద్రబాబు నాయుడు సొంత ఇల్లు నిర్మిస్తున్న విషయం విదితమే. ఈ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమం 25న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సిఎం చంద్రబాబు ఈనెల 24వతేది రాత్రి కుప్పం చేరుకుంటారని తెలిసింది.

# మళ్లీ మొదలైన ఏనుగుల దాడులు



సదుం, మే 22, ప్రభాతవార్త

మండలంలోని చెరుకు వారి పల్లి గ్రామపంచాయతీ పరిధిలో ని కుమ్మరపల్లి, పోతుంవారిపల్లి పరిధిలో మామిడి రైతుల పంటలను గురువారం ఉదయం తెల్లవారుజామున సుమారుగా 15 ఏనుగుల గుంపు దాడి చేసినట్లు రైతులు తెలిపారు. ఈ సందర్భంగా ఏనుగులు మామిడికాయలను తిని, చెట్ల కొమ్మలను విరిచే శాయని కుమ్మరపల్లి, పోతుం వారి పల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రిప్పు పైపులను, నీటి పైపులను తొక్కి నాశనం చేశాయని కుమ్మరపల్లికి చెందిన రైతులు ఎం.వెంకటేష్, వి. కామేశ్వర, వి సోమశేఖర్, వి. ఆదిలక్ష్మి, వి. లక్ష్మమ్మ, వి. శ్రీనివాసులు, పోతుంవారిపల్లికి చెందిన వి. రమేష్, వి. మునిస్వామి అనే మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు ఆరు నెలల క్రితం వరకు ఈ ప్రాంతాల్లో ఉన్న ఏనుగులు పులిచెర్ల మండలం కల్లూరు, పాతపేట తదితర ప్రాంతాలకు వెళ్లిపోయాయి. ఉన్నట్లుండి రాత్రి ఏనుగులు హఠాత్తుగా పొలాల పైకి రావడంతో రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మామిడికాయల కోతకు వచ్చిన సమయంలో ఇవి రావ డంతో ఎంతో కొంత ఆదాయం తెచ్చిపెట్టే మామిడి పంట నాశనం చేస్తున్నాయని వాటిని అరికట్టాలని రైతులు కోరారు.

# తీరనున్న ఏళ్ళ తరబడి కళ్ళిపూడి ప్రజల కల

## గంగ బ్రాంచి కాలువపై 22.5లక్షలతో బ్రిడ్జి నిర్మాణం

తొట్టంబేడు, మే 22 ప్రభాతవార్త

కళ్ళిపూడి గ్రామస్తుల ఏళ్ళ తరబడి కల నెరవేర నుంది. కళ్ళిపూడి గ్రామంలో 7వ బ్రాంచి కెనాల్‌పై ఉన్న చిన్నపాటి బ్రిడ్జిపాటి పైనే కళ్ళిపూడి వాసులు మృతదేహాలను స్మశానికి తరలించే సమయంలో బ్రిడ్జిపై నుంచి కాలువలో పడి ఇద్దరు ముగ్గురు మృతిచెందిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈనేపథ్యంలో గత ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి ముందుకు వచ్చినా పనులు చేపట్టేందుకు ఎవ్వరు ముందురాకపోవడంతో అలాగే మిగిలిపోయింది. దీంతో ఎంఎల్‌ఏ బొజ్జలసుధీర్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గురువారం ఏడో బ్రాంచి కాలువపై బ్రిడ్జినిర్మాణానికి రూ.22.5లక్షలతో నూతనంగాబ్రిడ్జికి



బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

గురువారంఎంఎల్‌ఏ భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏకు మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళమునిరాజనాయుడు, పూడి మాజీ సర్పంచ్ మునిరత్నం, కన్నలి ప్రతాప్‌రెడ్డిలు స్వాగతం పలికారు. మాట్లాడుతూ కళ్ళిపూడి గ్రామ ప్రజలు స్మశాన వాటికకు వెళ్ళడానికి దారిలేక ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి రావడంతో అధికారులతో చర్చించి బ్రిడ్జినిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. అదేవిధంగా మండలంలో 11 పనులకు గాను రూ.76లక్షలు, సత్యవేడు నియోజకవర్గం కెవిబిపురం మండలంలో 7 పనులకు రూ.43.60లక్షలు నిధులు మంజూరయ్యాయని బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో 45.70 లక్షలు నిధులు మంజూరయ్యాయని మంత్రి చొరవతో నిధులు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు తమ సొంత ఇంటి పనిలా భావించి నిర్మాణ పనులను పర్యవేక్షించాలని ఆయన కోరారు. రైతన్నలకు రెండో పంట పండించుకోవడానికి ప్రభుత్వం రెండో పర్యాయం నీరు విడుదల చేసిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు నియోజకవర్గ రైతుల తరపున ఆయన ధన్యవాదాలు తెలిపారు. పనుల్లో ఎక్కడా రాజీపడకుండా ఉండాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఈఈ రత్నారెడ్డి, డిఈఈ జైపాల్‌మార్టిన్, తహశీల్దార్ మధుసూధన్‌రెడ్డి, ఎంపిడిఓ సురేంద్రనాథ్‌రెడ్డి, కార్యదర్శి మురళీ, విఆర్‌ఓ రవి తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య, అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్ మౌర్య



తిరుపతి కార్పొరేషన్, మే 22, ప్రభాతవార్త

నగరపాలక సంస్థ పరిధిలోని భూపాల్ హౌసింగ్ కాలనీలోని పార్క్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 50 వార్డులోని భూపాల్ హౌసింగ్ కాలనీ, తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను గురువారం ఉదయం కమిషనర్ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేయాల్సిన పనుల గురించి ప్రజలు కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భూపాల్ హౌసింగ్ కాలనీలోని పార్క్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. అలాగే సీసీ రోడ్లు ఏర్పాటు చేసేందుకు పరిశీలన చేయాలని అన్నారు. ప్రధాన రహదారి పక్కన వెళుతున్న మురుగునీటి కాలువ నీరు రోడ్డుపైకి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై కూడా ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. అలాగే పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి మూర్తి , డి.ఈ. వెంకటప్రసాద్, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

# శ్రీ తిరుపతి గంగమ్మకు రూ.40 లక్షల ఆదాయం

కుప్పం, మే 22 ప్రభాతవార్త



జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారికి లక్షల ఆదాయం లభించింది. అమ్మవారి జాతర ముగియడంతో గురువారం దేవదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ, ఆలయ ఇఒ కమలాకర్‌ల నేతృత్వంలో ఆలయ ప్రాంగణంలో అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వ హించారు. అమ్మవారికి రూ.40 లక్షల ఆదాయం, 95 గ్రాముల బంగారం, 626 గ్రాముల వెండిని భక్తులు కానుకలుగా సమర్పించారు. కార్య క్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర, సిఎం పిఎ మనోహర్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, జనసేన కోఆర్డినేటర్ నరేష్, ఆలయ కమిటీ సభ్యులు జయరాంనాయుడు, శారదమ్మ, నరేష్, రాజ్‌కు మార్, పవన్ మహేష్, నేతలు మంజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

పెళ్లకూరు మే 22 ప్రభాతవార్త:

మండలంలోని పాలచూరు గ్రామంలో ఏర్పాటు చేయనున్న దమ్ము బయోఫియల్స్ పరిశ్రమ ఏర్పాటుపై గురువారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా పాలచ్చు రు గ్రామానికి చెందిన గ్రామస్తులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల వలన గాలి నీరు కలుషితమై అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. అదే విధంగా కోనేటి రాజుపాలెం నుంచి పాలచ్చు రు చేరుకునే పురాతన రహదారిని కూడా లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిశ్రమకు కేటాయించిన భూములు పెళ్లకూరు మండల పరిధిలో ఉండగా అవి నాయుడుపేట మండలంలో ఉన్నట్లు చూపించడంతో పరిశ్రమ యాజమాన్యానికి మండల అధికారులకు స్థానికులకు మధ్య సమన్వయ లోపం కనిపించింది అంతే కాకుండా ఈ సమావేశానికి గ్రామస్తులు అందరూ కూడా రాకపోవడంతో అక్కడికి వచ్చిన ఆ కొద్దీ మంది ప్రజలే వారి సమస్యలను



అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పరిశ్రమల యొక్క యాజమాన్యం అక్కడ స్థాపించబోయే పరిశ్రమల యొక్క వివరాలను స్థానికులకు చదివి వివరించారు. ఈ పరిశ్రమల ఏర్పాటుతో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడవని స్థానికులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ద్వారకనాథరెడ్డి, నాయకులు దువ్వూరు సతీష్ రెడ్డి శ్రీరాం ప్రసాద్ మల్లికార్జునరెడ్డి కట్టా సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు

# ఘనంగా బొజ్జల సుధీర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

శ్రీకాళహస్తి, మే 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పార్టీ కార్యాలయంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు ఆధ్వర్యంలో భారీకేక్ తెప్పించి ఎంఎల్‌ఏచే కట్‌చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ అందరి సహకారం మరవు లేనిదని కొనియాడారు. అనంతరం కేక్‌కట్‌చేసి పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయ కుమార్‌నాయుడు, తిరుపతిపార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, సుబ్బయ్య, అక్షింత కృష్ణయాదవ్, కాసరం రమేష్, ప్రకాష్, ఢిల్లీబాబు, షాకీరాలీ, రామ కృష్ణయాదవ్‌ల సారధ్యంలో పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు.

# అర్ధగిరిలో వైభవంగా శ్రీహనుమాన్ జయంతి వేడుకలు



తవణంపల్లె, మే 22 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామివారి దేవస్థానంలో గురువారం శ్రీహనుమాన్ జయంతి వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ఈఓ టి.హనుమంతరావు ఆధ్వర్యంలో ఈవేడుకలను నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ అనంతరం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించి విశేషాలంకరణతో ధూపదీపనైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అదేవిధంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మండపంలో శాస్త్రోక్తంగా కలశారాధన, ఉత్సవ విగ్రహస్నపన తిరుమంజనం, మంత్రపుష్పం,మహామంగళహారతి, సాయంత్రం 5 గంటలకు తులసీ పుష్పాదులచే సహస్రనామపూజ నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు స్వామివారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకపల్లకిపై వుంచి సంజీవరాయని పుష్కరిణి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేయించారు. అశేష భక్తజనంతో అర్ధగిరి ఆలయం కిక్కిరిసింది.

**శ్రీఆంజనేయ మాల ఇరుముడులు సమర్పణ**

అర్థగిరి దేవస్థానం ప్రవేశపెట్టిన శ్రీఆంజనేయ మాలధారణ చేపట్టిన భక్తులు శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా ఇరుముడులను సమర్పించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు మాలధారణ చేపట్టారు. దీక్ష చేపట్టిన భక్తులు గురువారం అర్ధగిరి ఆలయంకు చేరుకుని స్వామివారికి ఇరుముడులను సమర్పించారు. ఇరుముడులతో ఆలయానికి చేరుకున్న భక్తుల కోసం ఆలయం వద్ద ఆలయాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా అర్ధగిరి దేవస్థానంలో చేపట్టిన ప్రత్యేకాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.

# జపాలిలో భద్రతపై ఎస్పీ తనిఖీలు



హనుమజ్జయంతిన భక్తుల రద్దీ పెరగడంతో తిరుమలలోని జపాలిఆలయంవద్ద తనిఖీలుచేస్తున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ,డిఎస్పీ విజయశేఖర్

ప్రభాతవార్త-తిరుమల

# బొజ్జల అభిమానులతో ఊరందూరు కళ కళ

## అంబరాన్ని అంటిన సంబరాలు





శ్రీకాళహస్తిరూరల్,మే 22 ప్రభాతవార్త

ఐదేళ్ళ తరువాత శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో రాజకీయ సందడి చోటు చేసుకుంది. బొజ్జల కుటుంబానికి చెందిన యువ నాయకుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తన జన్మదిన వేడుకలను నిరాడంబరంగా జరుపుకున్నారు. గురువారం ఆయన జన్మదిన వేడుకలను అనుచరులు భారీ ఎత్తున ఏర్పాటు చేసారు. అర్థరాత్రి దాటిన తరువాత ఆయన అనుచరులు రంగినేని చెంచయ్యనాయుడు, రావిళ్ళ మునిరాజానాయుడు, దుర్గా ప్రసాద్,బాలాజి రెడ్డి,ప్రవీణ్,శ్రీనివాసులునాయుడు, లక్ష్మీ నారాయణ,వినయ్,సాయి,సుజిత్,శీను,గిరి,రమణ,మోహన్‌లాల్,పవన్‌ల సారథ్యంలో జన్మదిన సంబరాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమాల్లో సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి ఆయన కుమార్తె పాల్గొన్నారు. తరువాత సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ చే ఆశీర్వదించారు.

**సంబరాలే సంబరాల . . .**

శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామంలో గురువారం ఉదయం నుంచి సందడి చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి,ఏర్పేడు,రేణిగుంట,పట్టణానికి చెందిన పలువురు నాయకులు గ్రామంలోని ఎంఎల్‌ఏ నివాసం వద్దకు చేరుకొని శాలువలు కప్పెవారు, కేక్‌లు కట్ చేసే వారితో సందడి చేసుకుంది. మత గురువులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.సీనియర్ నాయకులు ఆయనను అభినందించారు. పరిపాలనలో చక్కగా గోపాలన్న మార్కును తీసుకు రావాలని ఆశీర్వదించారు.శ్రీకాళహస్తిపట్టణానికి చెందిన నాయకులు కాసరం రమేష్,పేట బాలాజి, విజయ కుమార్‌నాయుడు,మైనారిటి నాయకులు ఖాదర్‌బాషా, షాకీర్ అలి,ఖలీల్ పర్యవేక్షించారు. వచ్చిన అతిథులకు ఆతిథ్యం ఇవ్వటంలో బొజ్జల బృందమ్మ,రిషితారెడ్డిలు వ్యక్తిగతంగా పర్యవేక్షించారు. కాగా అతిథ్యంలో తొట్టంబేడు మండల అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు పర్యవేక్షించారు.పాస్టర్లు, తొండమాన్‌పురం ఆలయ అర్చకులు, శ్రీకాళహస్తీశ్వరాలయ అర్చకులు ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. కాగా జామియామస్జిద్ ముతవల్లి అక్రమ్‌సాహెబ్,ఖాజీ మున్నా, సభ్యులు అంజద్ సాహెబ్,హమీద్ తదితరులు పాల్గొన్నారు. ఏర్పేడు మండలం నాయకులు పొన్నారావు,ధనంజయులునాయుడు,పేరం నాగరాజనాయుడు,బాబున ఆయుడు,బత్తల గిరినాయుడు,శ్రీకాళహస్తి మండలానికి చెందిన నూతన అధ్యక్షుడు డాక్టర్ కృష్ణయాదవ్,కృష్ణమనాయుడు,ఉపాధ్యాయులు రామిరెడ్డి,బత్తిరెడ్డి,జగదీశ్వరరెడ్డి, కామేష్ యాదవ్, తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి,చెలికం పాపిరెడ్డి,తదితరుల సారథ్యంలో భారీ ఎత్తున కార్యకర్తలు తరలి వచ్చారు.ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా రూరల్ ఎస్ఐ నరసింహారావు వారి సిబ్బంది పర్యవేక్షించారు.

## గుడిమల్లంలో అన్నదానం



శ్రీకాళహస్తిరూరల్,మే 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని గుడిమల్లం పరశురామేశ్వరాలయం వద్ద శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా మాజీ ఛైర్మెన్ బత్తల గిరిబాబునాయుడు సారథ్యంలో అన్నదానం జరిపారు.ఆలయానికి గిరిబాబునాయుడు అన్నదానానికి రూ.10వేలు చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన నిరుపేదలతో పాటు ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం జరిపారు. యువనాయకుడు సుధీర్‌రెడ్డి సారథ్యంలో ఏర్పేడు మండలంలో అభివృద్ధి గణనీయంగా ముందుకు సాగుతుందని వివరించారు. ముఖ్యంగా గత పాలనలో ఆలయానికి వచ్చేందుకు సరైన రోడ్డు సదుపాయం లేదని అయితే సుధీర్‌రెడ్డి గెలిచిన తరువాత కలెక్టర్‌ను ఒప్పించి రోడ్డు సదుపాయం కల్పించారన్నారు.ఇలా అభివృద్ధికి బ్రాండ్‌గా ఉన్న సుధీర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదానంజరపటంతనకుమంచి అవకాశం అన్నారు.ఈ కార్యక్రమాల్లో ఇఒ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## తెలుగుయువత నాయకుడు మృతి

శ్రీకాళహస్తి, మే 22 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి పట్టణంలో గతంలో తెలుగుయువత నాయకుడుగా పని చేసిన సెంజిగారం వడి వేలు గురువారం సాయంత్రం హఠాత్తుగా మృతి చెందారు.ఆయన మృతికి పట్టణంలోని నాయకులు పార్టీలతో ప్రమేయం లేకుండా సంతాపాలు తెలిపారు. వేలు పార్టీ కీలకంగా వ్యవహరించారు. మున్సిపల్ ఎన్నికల్లో 9 వార్డును మహిళలకు కేటాయించటంతో ఆమె భార్య సుప్రజకు అవకాశం కల్పించారు. 9 వార్డు కౌన్సిలర్‌గా గణనీయంగా అభివృద్ధి పథంలో నడిపిన వేలు మృతి పార్టీకి తీరని లోటు అని పలువురు వివరించారు.మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు, మునిరామయ్య పలువురు తెలుగుదేశం నాయకులు సంతాపాలు తెలిపారు.

## ఎర్రమట్టి దొంగల నుంచి గుట్టలను కాపాడండి



ఆర్డీవోకు సీపీఎం వినతి

తిరుపతి రూరల్, మే 22 ప్రభాతవార్త ః

చంద్రగిరి, రామచంద్రాపురం మండలంలో గుట్టను చదును చేసి ఎర్రమట్టి అమ్ముకుంటున్న దొంగలను గుట్టను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటి సభ్యులు ఎస్. జయచంద్ర, తిరుపతి రూరల్ కార్యదర్శి కె.సుమన్ గురువారం ఆర్డీవోను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ చంద్రగిరి నియోజక వర్గం పరిధిలో ఉండే పంచాయితీ ఆఫీసు అధికార వర్గానికి కూతవేటు దూరంలో ఉండే చంద్రగిరి ప్రభుత్వ బాయ్ హాస్టల్ దగ్గర 1479 సర్వే నెంబర్లుల్లో మట్టిని తవ్వి వందల ట్రిప్పులు తీసుకెళుతున్నారన్నారు. అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని బాధపడ్డారు. అలాగే రామచంద్రాపురం మండలం, రామాపురం నుంచి పచ్చికాపలం రోడ్డు వరకు మట్టి దొంగలు కొండలన్నీ మాయమై ఎర్రమట్టి అమ్ముకుంటున్న తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఎర్రమట్టి దొంగలు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది కుమ్మకై ఈ పనులు కొనసాగిస్తున్నారని చెప్పారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి మట్టి దొంగలపై తగు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## ముగ్గురు సర్పంచ్‌లు టిడిపిలో చేరిక

తిరుపతి రూరల్, మే 22 ప్రభాతవార్త ః



తిరుపతి రూరల్ మండలంలోని వైసీపీ పార్టీ సర్పంచులు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో గురువారం టీడీపీ పార్టీలో చేరారు. చిగురువాడ, కేసీపేట, పద్మావతిపురం సర్పంచులను, కార్యకర్తలను టీడీపీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి నాని ఆహ్వానించారు. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో అభివృద్ధి ఏమీ జరగలేదని, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానంగా పులివర్తి నాని హయాంలో నియోజక వర్గం అభివృద్ధి పథంలో ముందు ఉందన్నారు. పార్టీలకు అతీతంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో పులివర్తి నాని నియోజక వర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తుండడంతో తాము టీడీపీ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, సర్పంచులు, కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన తిరుపతి

ఎల్బీనగర్ కు చెందిన అరవ కీర్తన ఆలైవ్

తిరుపతి క్రీడ, మే 22, ప్రభాతవార్త



హలెల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ ఆగస్టిన్ వారి ఆధ్వర్యంలో 2024 డిసెంబర్ 1న నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లో దాదా పు 18 దేశములలో నుండి 1500 మంది విద్యార్థులు పాల్గొని ఒక గంట పాటు కీబోర్డ్ ప్లే చేయడం జరిగినది. అందులో తిరు పతి జిల్లా ఎల్బీనగర్ కు చెందిన విజయబాబు శైలజ కుమార్తె 6వ తరగతిచదువుతున్నఅరవకీర్తనఆలివ్‌గిన్నిస్‌వరల్డ్‌రికార్డ్‌సాధించిం˝ది

## శ్రీరామ భక్తుడికి పాలాభిషేకం



వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

చంద్రగిరి, మే 22 ప్రభాతవార్త:

శ్రీరామచంద్రుడికి పరమ భక్తుడైన పంచముఖ ఆంజనేయ స్వామి వారికి శ్రీ ఉగ్రప్రత్యంగిరా పీఠాధిపతి సూరి స్వామి ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం తొండవాడ వద్ద గల శ్రీపంచముఖ ఆంజనేయస్వామి వారికి ఉదయం పాలాభిషేం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 6.30 గంటలకు కలశ ప్రతిష్ట, మూలవిరాట్టుకు అభిషేకం, 9 గంటలకు కదళీ ఫలహోమం, 10 గంటలకు 1108 లీలర్లు పాలతో అభిషేకం కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం 5 గంటలకు ఆంజనేయ స్వామి వారి ఆలయ ప్రదక్షిణ ఉత్సవం, 6 గంటలకు షిరిడీ సాయి భజన బృందంచే భజన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా శ్రీవారిమెట్టు మార్గంలో వెలసియున్న శ్రీభక్తాంజనేయస్వామి వారికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విశేష పూజలు నిర్వహించి, అన్నదానాలు జరిపించారు. చంద్రగిరి కోట గ్రామం వద్ద గల శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయంలో గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## అభివృద్ధి పనుల పర్యవేక్షణలో ఎంఎల్‌ఏ



**చంద్రగిరి, మే 22 ప్రభాతవార్త:** చంద్రగిరిలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఎంఎల్‌ఏ పులివర్తి నాని పరిశీలించారు. ఇందులో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించి, పురోగతిని అడిగితెలుసుకున్నారు. నిర్దిష్ట కాలపరిధిలో నిర్మాణ పనులు పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా చారిత్రాత్మక కైలాష్‌ధామం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, ఆర్థిక పరిస్థితులపై ఆరా తీశారు. చంద్రగిరిలో చేపట్టిన కైలాష్‌ధామం స్ఫూర్తితో తిరుపతి రూరల్ మండలంలో, పాకాల మండలంలో గోవిందధామం నిర్మాణాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాప్రస్థానం కమిటీ, టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## జైశ్రీరామ్.... వైభవంగా శ్రీ హనుమజ్జయంతి వేడుకలు.

. రేణిగుంట మే 22 ప్రభాతవార్త



రేణిగుంట మండలం గుత్తి వారి పల్లె గ్రామంలో కొలువుతీరిన శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం నందు గురువారం శ్రీ హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి నిర్వాహకులు పూజారి చేత ప్రత్యేక పూజలు జరిపించారు. స్వామివారికి అతి ప్రీతికరమైన తమలపాకుల పూజ చేసి, ఆయన మెడలో తమలపాకుల మాల, వడమాలలతో అలంకరింపజేశారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసంతర్పణ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా టిడిపి జిల్లా రైతు నాయకులు మునిస్వామి నాయుడు, బిజెపి మండల అధ్యక్షులు పూజారి ప్రేమ్ రెడ్డి, టిడిపి సీనియర్ నేత హైకోర్టు అడ్వకేట్ ఉదయ్ కుమార్ రెడ్డి, నిర్వహకులు పద్మనాభ రెడ్డి, ద్వారకా నాయుడు, వెంకట ముని, భాస్కర్ నాయుడు తదితరులు ఏర్పాట్లను పరివేక్షించారు.

## హిందువుగా జీవించు... హిందువునని గర్వించు...

రేణిగుంట మే 22 ప్రభాతవార్త



భారతదేశంలో జన్మించిన హిందువులు హిందువుగా జన్మించినందుకు గర్వించాలని బిజెపి యువ నాయకులు, ఓ బి సి నేత వెంకటాద్రి యాదవ్ అన్నారు. రేణిగుంట మండలం వెంకటాపురం గ్రామంలో గురువారం శ్రీ హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. ఉదయం దేవాలయంలో శ్రీ హనుమాన్ చాలీసా పఠించారు. అనంతరం శ్రీ హనుమాన్ దండకం వినిపించారు. ఆ తరువాత శ్రీ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆపై అన్నసంతర్పణ చేశారు.మునికృష్ణ, ముని, బత్తిరెడ్డి, జయ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా సైనిక్ స్కూల్‌కి నారాయణ విద్యార్థి ఎంపిక

తిరుపతి విద్య, మే 22 ప్రభాతవార్త



ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష 2025-2026 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కి చెందిన విద్యార్థిని సోహినీ కుంచేనపల్లి 270 మార్కులు సాధించిందని డీజీఎం కొండలరావు పేర్కొన్నారు.జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆల్ ఇండియా సైనిక్ ప్రవేశ పరీక్షల్లో విజయం పరంపరని కొనసాగిస్తున్నారని నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం డీజీఎం కొండలరావు,కాలేజీ కోర్ డీన్ ఏఎస్ రావు, డీజీఎం డాక్టర్ శ్రీనివాసులు,ఆర్ఐ వసంత్,ప్రిన్సిపాల్ సాహిద్ బాషా, ఉపాధ్యాయుల అభినందనలు తెలిపారు.

## వేదకాలం నుంచే యోగాధ్యయనం

-వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు

తిరుపతి విద్య, మే 22 ప్రభాతవార్త




భారత దేశంలో వేదకాలం నుంచే యోగాధ్యయనం జరుగుతోందని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు పేర్కొన్నారు. ఎస్వీయూ సెనేట్ హాల్లో యోగాంధ్ర-2025 ప్రచారంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక కార్యక్రమా న్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ వేదాలు, ఉపనిషత్తులలో యోగా ప్రాచీన మూలాలు వున్నాయని,శారీరక, మానసిక,భావోద్వేగ శ్రేయస్సు కోసం యోగా ఉపకరిస్తుందని తెలిపారు.2014లో జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని గుర్తుచేశారు.యోగా దినోత్సవంలో 192కు పైగా దేశాలు పాల్గొనడం శుభపరిణామమన్నారు. రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ యోగాంధ్ర-2025 లో వర్సిటీ చురుకైన పాత్రను పోషిస్తుందని,మెరుగైన ఆరోగ్యం,ఒత్తిడిని అధిగమించడానికి అధ్యాపకులు,సిబ్బంది, విద్యార్థులు యోగాను రోజువారీ అభ్యాసంగా స్వీకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ టి దామోదరం, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ యాదవ్,కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి వివేక్,యోగానిపుణురాలు డాక్టర్ నీరజ,యోగా శిక్షకులు ధనంజయ్,అమర్నాథ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## జనసేనచే అన్నదానం,చీరల పంపిణి

శ్రీకాళహస్తి,మే 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జనసేన జిల్లా కార్యదర్శి కొట్టె సాయి సారథ్యంలో వేడుకలను నిర్వహించారు. పార్టీ కార్యాల యంలో శాసనసభ్యుని సత్కరించారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానం,సామాజిక కార్యక్రమాలకు బొజ్జల రిషితా రెడ్డి ముఖ్య అతిదిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమాల్లో నిరుపేదలకు చీరలు పంపిణి చేసారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి కొట్టేసాయి, కుమార్,మాదవ్, మహేస్,దండి రాఘవయ్య, గరికపాటి చంద్ర, రామిశెట్టి కిరణ్, పగడాలప్రతాప్, ఈగలబాలాజి,డిల్లిబాబు,సురేష్,రాఘవ,చింతరఘుహుస్సే న్,ఉస్మాన్‌బాషా పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి నియోజవర్గంలో యువతకు పగ్గాలు

శ్రీకాళహస్తి మున్సిపాలిటికి పాతనాయకునికే!

శ్రీకాళహస్తి,మే 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజక వర్గంలో ఉమ్మడి ప్రభుత్వం వచ్చిన తరువాత పరిపాలనలో మార్పులు చేర్పులు చోటు చేసుకున్నాయి. వివిధ సమీకరణలు,అంచనాలతో యువతకు ప్రాధాన్యత ఇస్తూ మండల నాయకులను ప్రకటించారు. శ్రీకాళహస్తి పట్టణ పార్టీ అధ్యక్షుడుగా జి. విజయకుమార్‌నాయుడు ఎంపిక చేసారు.శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని దేశం పార్టీ అధ్యక్ష పదవిని విజయకుమార్‌నాయుడుకు అప్పగించారు. శ్రీకాళహస్తి మండలం నాయకుడుగా కామేష్‌యాదవ్ సుమారు 15 సంవత్సరాలుగా కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో ఉడమల పాడు గ్రామానికి చెందిన జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు డాక్టర్ అక్షింతల కృష్ణయాదవ్‌కు పగ్గాలు అప్పగించారు. ఏర్పేడు మండల అధ్యక్షులుగా పొన్నారావు పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. ఆయన స్థానంలో పేరం నాగరాజునాయుడుకు ఎంపిక చేసారు. గోవిందవరం గ్రామానికి చెందిన మాజీ జడ్‌పిటిసి పేరం ధనంజయులు నాయుడు అన్నకుమారుడు పేరం నాగరాజు నాయుడుకు పగ్గాలు అప్పగించారు. కాగా తొట్టంబేడు మండల పార్టీ పగ్గాలను మాజీ పాలసరఫరా సంఘం అధ్యక్షులు రావిళ్ళ మునిరాజానాయుడుకు అప్పగించారు.

## బేరివారి మండపం వద్ద అన్నదానం

శ్రీకాళహస్తి,మే 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా గురువారం మీడియా ప్రతినిధి మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్ సారథ్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.ఆది నుంచి సుధీర్‌రెడ్డికి ముఖ్యఅనుచరుడుగా ఉన్న దుర్గా ప్రసాద్ ఆయన జన్మదినం సందర్భంగా సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వేలాది మందికి ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో దుర్గా ప్రసాద్‌తో పాటు వినయ్,మాజీ కౌన్సిలర్ బీమాల మునికృష్ణయ్య, వినయ్ తెలుగుయువత కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## గంగమ్మ ఆలయానికి విరాళం

తిరుపతి(రవాణ),మే 22ప్రభాతవార్త



తాతయ్యగుంట గంగమ్మతల్లిపై తిరుపతి ప్రజలకు ఉన్న గొప్ప విశ్వాసం మన సంస్కృతిని ప్రతిబింబిస్తుందని తిరుపతివాసి మాదాల శ్రీనివాసతేజ తెలిపారు. గుడిని గుడి కట్టుబాట్లను కాపాడుకోవడం మన యువత బాధ్యత ,నావంతు కృషిగా అమ్మవారికి 1,00,116 రూపాయలు చెక్కును స్మార్ట్‌చెక్ అధినేత శ్రీనివాసతేజ ఇచ్చారు. గురువారం ఉదయం గంగమ్మ ఆలయ ఈఓ జయకుమార్‌కు ఈ విరాళాన్ని అందజేశారు.

## దాసభక్తుడు హనుమంతునికి

తిరుపతి(రవాణ),మే 22ప్రభాతవార్త



శ్రీరామచంద్రుని బంటుగా దాసభక్తుడు హనుమంతునికి ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ఉదయం రాయలసీమరంగస్థలి విశేష పూజలు నిర్వహించింది. ఉదయం నాలుక్కాళ్ళమండపం వద్ద ఉన్న హనుమాన్ ఆలయంలో హనుమత జయంతి సందర్భంగా రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. కళాకారులతో కలసి ప్రత్యేక అభిషేకాలు చేశారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ధైర్యానికి,విజయానికి ప్రత్యేక ఆంజనేయస్వామి అని గుర్తుచేశారు. అనంతరం భక్తులకు గుండాల గోపీనాథరెడ్డి కళకారులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కెఎన్ రాజ, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కస్పాపద్మనాభం, మునినాథరెడ్డి, కొండే చెంగారెడ్డి, బండ్లవీధి మురళి, సుబ్రమణ్యంరెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొని సంకీర్తనలు ఆలపించారు.

## టిటిడి ఆలయాల్లో వేడుకగా హనుమాన్‌జయంతి

తిరుపతి(రవాణ),మే 22ప్రభాతవార్త

తిరుపతిలోని టిటిడి అనుబంధ శ్రీ ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం ఉదయం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గోవిందరాజస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో, గాంధీరోడ్డులోని మఠంఆంజనేయస్వామి ఆలయంలో, శ్రీనివాసం ఎదురుగా ఉన్న అభయ ఆంజనేయాస్వామి ఆలయంలో, అలిపిరి పాదాలమండపం వద్ద భక్త ఆంజనేయస్వామి ఆలయంలో, కపిలేశ్వరస్వామి ఆలయంలో పరిధిలో అభయహస్త ఆంజనేయ ఆలయాల్లో స్వామివారికి అబిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు

## పనిచేసిన వారికే పార్టీ పదవులు!

-కార్పొరేషన్ ఎన్నికల అభ్యర్థులకే డివిజన్ బాధ్యతలు

-తిరుపతిని మరింత పచ్చదనంతో సుందరీకరణ -మినీమహానాడులో తీర్మానాలు

తిరుపతి,మే 22ప్రభాతవార్త:



పార్టీని నమ్ముకుని,పార్టీకోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నాయకులకు పార్టీలో స్థానిక పదవులు కేటాయించడం జరుగుతుందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పచ్చదనం,సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.సుగుణమ్మ ప్రకటించారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీచేసిన కార్యకర్తలకే ఇప్పుడు డివిజన్ బాధ్యతలు అప్పగిస్తామని వెల్లడించారు. తిరుపతి ప్రాధాన్యతతో ఇక్కడ మొక్కలు నాటి పచ్చదనం మరింతగా పెంపొందించాలని తీర్మానించారు. కడపలో జరిగే మహానాడుకు తిరుపతి నియోజకవర్గం నుండి పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు కదలివెళ్ళి తమ సత్తాచాటాలని ఆమె కోరారు. గురువారం ఉదయం తిరుపతిలోని పార్టీ కార్యాలయంలో మినీమహానాడు జరిగింది. టిడిపి రాష్ట్రపార్టీ, జిల్లా కమిటీ,నియోజకవర్గ, డివిజన్‌స్థాయి, పార్టీ సీనియర్ నాయకులు నరసింహయాదవ్, సూరాసుధాకర్‌రెడ్డి, వి.పుష్పావతియాదవ్, బి.శ్రీధర్‌వర్మ, ఆర్‌సి మునికృష్ణ, వట్టికుంట చిన్నబాబు, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, మబ్బుదేవనారాయణరెడ్డి, దంపూరి భాస్కర్‌యాదవ్, బిజి కృష్ణ యాదవ్, సదాశివం, కుమారమ్మ, అంబుజ, మన్నెం శ్రీనివాసులు, ఊకా విజయకుమార్ , మునిరామయ్య, విజయలక్ష్మి, బుల్లెట్‌రమణ, కంకణాల రజినీకాంత్‌నాయుడు, కాంగ్ర లక్ష్మీపతినాయుడు,సింగంశెట్టిసుబ్బరామయ్య, ఆర్‌పి శ్రీనివాసులు, హేమంత్‌రాయల్, పవన్‌చౌదరి, అన్నా అనితయాదవ్, ఊట్లసురేంద్రనాయుడు, పాతకం వెంకటేశ్, ఆముదాల తులసీ, మునిశేఖర్‌రాయల్ తదితరులు కార్యకర్తలు, 50 డివిజన్‌ల నుండి మహిళలు పాల్గొన్నారు. మినీమహానాడులో తిరుపతిలో పార్టీ పదవులు, కార్యకర్తలకు సముచిత స్థానంపై చర్చించి ఆమోదించారు.పార్టీలో నాయకులకు తగిన సముచితస్థానం కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని, అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం చేస్తానని సుగుణమ్మ తెలిపారు. అంతకుముందు పలు కారణాలతో మృతి చెందిన పార్టీశ్రేణులకు కొన్నినిమిషాలు మౌనంపాటించి నివాళులర్పించారు. అనంతరం సిఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఎంఎస్ మునిరాజ కార్యకర్తకు 47 లక్షల రూపాయలు చెక్కును అందజేశారు.

## పిచ్చాటూరులో ఎమ్మెల్యే చేతులు మీదుగా సివిల్ సప్లై గోడౌన్ ప్రారంభం

రేషన్ బియ్యం స్మగ్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

పిచ్చాటూరు, మే 22 ప్రభాతవార్త :



సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండల కేంద్రంలో గురువారం ఉదయం 11గంటలకు ప్రభుత్వ నిధులతో కొత్తగా నిర్మించిన పౌర సరఫరా శాఖకు చెందిన గోడౌన్‌ను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. పేద ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందిస్తు_న్న నిత్యవసర సరుకులను బ్లాకులోకి తరలించి అమ్మితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిచ్చాటూరులో అరణీయార్ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తీసుకొచ్చి జలాశయం నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా కీళపూడి ప్రాంతానికి సాగునీరు అందించే ప్రణాళికు ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అలాగే అరణీయార్ ప్రాజెక్టు వద్ద పర్యాటక అభివృద్ధి పనులు ద్వారా వ్యూ టవర్, బోటింగ్, చిల్డ్రన్స్ పార్క్ పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. శ్రీ కాళహస్తీ ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేయిస్తామన్నారు.మాజీ ఎఎంసి ఛైర్మనఖ డి ఇళంగోవన్‌రెడ్డి, సివిల్ సప్లై డిఎంపై సుమతి, డిఎస్‌ఓ శేషాచలంరాజు, ఎంపిడిఓ మహమ్మద్ రఫీ, రేషన్ డీలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## రేపు సాయంత్రం జీతెలుగు అప్సరఅవార్డ్స్

తిరుపతి(రవాణ),మే 22ప్రభాతవార్త

ప్రతిభావంతులైన కళాకారులు, దర్శకులు,రచయితలు నిర్మాతలు అచంచలమైన అంకితభావంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూన్న జీ తెలుగు శనివారం సాయంత్రం 5.30గంటలకు అప్సరఅవార్డ్స్ ప్రసారం కానుంది. ఇరవైసంవత్సరాల మైలురాయిని చేరుకున్న సమయంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు ప్రతిష్టాత్మక జీ తెలుగు అప్సరఅవార్డులను ప్రదానం చేసింది. వెండితెర, బుల్లితెర తారల సందడితో అప్సరఅవార్డ్స్ ప్రసారం ఉంది. యాంకర్స్‌సుదీర్, రవి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఆత్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ కార్యక్రమంలో డ్రామా జూనియర్స్‌పిల్లలు చిరంజీవి, బాలకృష్ణ గెటప్‌లోవేదికపైకి వచ్చి నటి రోజాకు అవార్డుఅందించారు. ప్రముఖుల బావోద్వేగభరిత ప్రసంగాలు మనస్సులను గెలుచుకుంటాయని ప్రతినిధి ప్రసాద్‌గుప్తతెలిపారు.

## టిడిపి మండల అధ్యక్షుడుగా చంద్రారెడ్డి



పట్టణ అధ్యక్షుడుగా మహబూబ్ బాషా

రేణిగుంట మే 22 ప్రభాతవార్త

రేణిగుంట మండల టిడిపి అధ్యక్ష పదవి మరోసారి ముని చంద్రారెడ్డిని అలంకరించింది. రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్ష పదవి ఇంకోసారి మహబూబ్ బాషాను వరించింది. పార్టీ కష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు పార్టీకి ఎనలేని సేవ అందించినందుకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి వీరిద్దరి పేర్లను సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి, మహబూబ్ బాషా సంయుక్తంగా మాట్లాడుతూ పదవులు రావడానికి సిఫార్సు చేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారు. తమ ప్రియతమ నాయకుడు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ పదవులు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పార్టీని బలోపేతం చేయడానికి నిర్విరామంగా కృషి చేస్తామన్నారు. మండల పార్టీ అధ్యక్షునిగా గ్రామ గ్రామం తిరిగి ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తానని చంద్రారెడ్డి అన్నారు. రేణిగుంట పట్టణంలోని వీధిలన్నిటిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.


కెనరా బ్యాంక్ Canara Bank Together we can — పుత్తూరు శాఖ, పుత్తూరు, సెల్: 8330938031

**బంగారు నగల వేలం ప్రకటన**

ఇందుమూలముగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన ఋణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపినను ఐట్టాదా కాకుండా తిరిగి వచ్చినది. 29.05.2025 వ తేది లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో **తేది:30.05.2025 సా.4.00గం॥లకు లేదా బ్యాంకు** నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు.

| క్ర. నెం. | ఖాతానెం. | ఋణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం రూ. |
|---|---|---|---|---|
| 1 | 6610836002540 | ఎస్.మధు, తండ్రి ఎస్.క్రిష్ణయ్య, డి.నెం.3-47, గొల్లపల్లి, రామక్రిష్ణాపురం, పుత్తూరు | 5.400 | 31,663.87 |

పుత్తూరు, తేది: 22.05.2025 — సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

# హనుమాన్ జయంతి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు

గూడూరు, మే 22, ప్రభాతవార్త

గూడూరు పట్టణ సమీపంలోని ఇందిరమ్మ కాలనీ సునీల్ కుమార్ నగర్‌లో ఉన్న కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు విశేషాలంకరణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని మాలవ్య నగర్ వద్ద ఉన్న శ్రీరామరక్షకుటీరం నందు హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి వారికి విశేషాలంకరణ ఏర్పాటు చేశారు. అనంతరం దంపతులచే అష్టోత్తర శతనాగవల్లి దళార్చన పూజ ఘనంగా నిర్వహించారు. భక్తులు జై హనుమాన్ అంటూ నామస్మరణ చేస్తే



పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. హనుమాన్ జయంతి సందర్భంగా గూడూరు పట్టణంలోని విజ్ఞేశ్వరపురంలో ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద విశేష పూజలు వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే ఆది శంకర కళాశాల పక్కన ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి ఎమ్మెల్యే విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. గూడూరు పట్టణంలోని కోనేటి మీట్టలో ఉన్న శ్రీ కోదండ రామాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి వారికి విశేషాలంకరణ అభిషేకం అనంతరం భక్తులచే లక్ష తమలపాకుల పూజ వైభవంగా నిర్వహించారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



వెంకటగిరి మే 22 ప్రభాతవార్త :

మున్సిపాలిటీలో కార్మికులు దీర్ఘకాలికంగా సమస్యలను పరిష్కరిం చాలని గురువారం ఉదయం మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తాసిల్దార్ రాంబాబులకు వినతి పత్రం అందజేశారు. డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో నోటీసు ఇవ్వడం జరిగింది. కార్మికుల మీద యూనియన్ లీడర్ల మీద మరియు మహిళా కార్మికుల పైన ఉద్దేశపూర్వకంగా శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, ప్రతిరోజు విధులకు హాజరవుతున్నా కూడా కక్షగట్టి ఆఫ్ సెంట్‌లు వేసి ప్రతినెల జీతాల్లో కోత విధిస్తున్నారని, చెత్త వాహనాల డ్రైవర్లకు జీవో నెంబర్ 36 ప్రకారం 24,500 రూపాయలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పి రవి, ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం వెంకటగిరి అధ్యక్షుడు ఎన్.మురుగన్,ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు నాయకులు టి సుబ్బయ్య, ఎస్ ప్రసాద్, పెంచలయ్య, ఎస్ గోపాల్, రమణయ్య, హరిబాబు, మరియు మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## 15 కుటుంబాలకు ఫలసరుకులు, రొఖ్ఖం అందుచేత

వాకాడు, మే 22, ప్రభాతవార్త



వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలో సీనియర్ వైకాపా నేత కొడవలూరు రాధాకృష్ణారెడ్డి నాల్గవ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు జిల్లా వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి కొడవలూరు దామోదర్ రెడ్డి, పుట్టం వెంకటేశ్వరరెడ్డి, అనురాధమ్మలు 15 కుటుంబాలకు ఫలసరుకులు, కూరగాయలు, రొఖ్ఖం అందచేశారు. ఈ సందర్భంగా హేమంత్ స్వామి,శేషాద్రి స్వామి మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి సీనియర్ నేత రాధాకృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా 15 కుటుంబాలను ఆదుకోవడం ముదావహమన్నారు. కార్యక్రమంలో శివ, సాయిబాబు, పవన్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫోర్టు వ్యవస్థను నాశనం చేసిన వైసిపి ప్రభుత్వం

### - రాష్ట్ర టిడిపి నాయకులు కిరణ్ కుమార్



గూడూరు, మే 22, ప్రభాతవార్త

గత వైసీపీ ప్రభుత్వంలో గ్రీన్ టాక్స్ విపరీతంగా పెంచి ట్రాన్స్పోర్ట్ వ్యవస్థను నాశనం చేసిందని అనేకమంది వాహనా విపరీతమైన టాక్స్‌లు కట్టలేక ఓనర్లు వర్కర్లుగా మారిపోయారని ఇప్పుడు టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రీన్ టాక్స్ 1500 రూపాయలకు తగ్గించడం జరిగిందని రాష్ట్ర టిడిపి నాయకులు కిరణ్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో టిడిపి రాష్ట్ర నాయకులు కిరణ్ కుమార్ మాట్లాడుతూ 2014 టిడిపి ప్రభుత్వం ఉన్నప్పుడు గ్రీన్ టాక్స్ 200 రూపాయలు ఉన్నదని ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం 10,000, 15,000 రూపాయలకు పెంచిందని గుర్తు చేశారు. ఈ టాక్స్‌లు కట్టుకోలేక అనేకమంది ఓనర్లు వర్కర్లుగా మారిపోయారని అన్నారు. సమావేశంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వరరాజు, రహీం, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో హిందూ స్మశాన వాటిక ఏర్పాటు

గూడూరు, మే 22, ప్రభాతవార్త

గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ చొరవతో గూడూరు గాంధీ నగర్ ప్రజల చిరకాల కోరిక హిందూ స్మశానం వాటిక ఏర్పాటు చేయడం జరిగింది. గత శవాన్ని తీసుకుని స్మశానానికి వెళ్లాలంటే పెద్ద ఓరవ కాలువ దాటుకుని తిరుపతి రైల్వే ట్రాక్ దాటుకొని ఇటువైపు, అటువైపు ఉన్నటువంటి ఇనుప కంచెలు మధ్యలో బాడీని దూర్చి స్మశానానికి వెళ్ళవలసి ఉండేది. ఈ సమస్యను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అందులో భాగంగా గత ఫిబ్రవరిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఈ సమస్యను ఎమ్మెల్యే ద్వారా సబ్ కలెక్టర్‌కి ఎమ్మార్వోకి తెలియజేశారు. అంతేకాకుండా ఈ సమస్యను తిరుపతి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులైన ఏసుపాకు పెంచలయ్య ద్వారా మొట్టమొదటి దీజులీది సమావేశంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, గూడూరు తహసిల్దార్ చంద్రశేఖర్ వెంటనే స్పందించి క్రిస్టియన్ సమాధులు ప్రక్కన సర్వే చేయించి ఒక ఎకరా ఖాళీ భూమిని హిందూ స్మశానానికి కేటాయించారు. స్మశానం ఏర్పాటుకు జిల్లా డివిఎంసి సభ్యులు ఏసుపాకు పెంచలయ్య, డివిజన్ డివిఎంసి సభ్యులు రావూరు సురేంద్ర, గాంధీనగర్ తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీపాదం ఉదయ్ కుమార్, బట్టేపాటి వెంకట కృష్ణయ్య, అంకిరెడ్డి రమేష్ రెడ్డి, దానం శ్యాంబాబు, మాతంగి పటాస్ చంద్ర శేఖర్, శ్రీ వర్ధన్ రెడ్డి తదితరులు కృషి చేశారు.

## ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

బాలాయపల్లి, మే 22, ప్రభాతవార్త

మండలంలోని మన్నూరు గ్రామ సచివాలయ ఆవరణలో పింక్ బస్సు స్క్రీనింగ్ పరీక్షలు శ్రీ బాలాజీ ఇన్స్టిట్యూట్ అఫ్ ఆంకాలజి, స్విమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగాయి. మొబైల్ కాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ద్వారా ఉచితంగా కాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరాన్ని స్విమ్స్ వైద్యాధికారిణి డా.చైతన్య భాను, డా.లియోనలు నిర్వహించారు. రోగులకు బిపి, షుగర్, ఇంకా పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కాన్సర్ స్క్రీనింగ్ లో స్విమ్స్ వైద్యాధికారిణి డా.చైతన్య భాను, డా.లియోనా, వైద్య సిబ్బంది ఏ.ఎన్.ఎం.లు, స్విమ్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా అడుగులు



చిత్తూరురూరల్, మే 22 ప్రభాతవార్త:

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావులు పేర్కొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా స్థాయి మహానాడు జిల్లా పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణలో వున్న రామారావు విగ్రహానికి జిల్లా అధ్యక్షుడు సిఆర్ రాజన్, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్, భానుప్రకాష్‌లు, మాజీ ఎమ్మెల్సీలు బిఎన్.రాజసింహులు, గౌని శ్రీనివాసులు, మేయర్ అముద తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావులు మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం శ్రమిస్తున్న సిఎం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంను కలసికట్టుగా బలపరచాలని పిలుపునిచ్చారు. కడప వేదికగా ఈ నెల 27 నుండి మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర మహానాడు విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ తన మనుగడ కోసం కుట్ర పన్నుతున్నారని, ఎన్ని కుట్రలు చేసిన కూటమి ప్రభుత్వానికి ఏమి కాదన్నారు. సమావేశంలో జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ జిల్లా మహానాడులో 27 ప్రతిపాదనలను సమావేశం ముందుంచి పార్టీ శ్రేణుల నుండి ఆమోదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యేలు ఎఎస్ మనోహర్, ఆర్.గాంధీలు, జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబునాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధులు వెంకిటీల సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్‌లు, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, తెలుగుదేశం జిల్లా కమిటీ సభ్యులు, జిల్లాలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం పేదలకు నాణ్యమైన బియ్యం అందిస్తుంది

### - జిల్లా కలెక్టర్



వాకాడు, మే 22, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నాణ్యమైన క్వాలిటీతో ఉన్న బియ్యమును సరఫరా చేస్తుందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం వాకాడు మండల్ లెవెల్ స్టాక్ పాయింట్‌ని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆకస్మికంగా పరిశీలించారు. స్టాక్ పాయింట్లో ఉన్న బియ్యమును, ఉన్నటువంటి వస్తువులను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన బియ్యమును పేదలకు సరఫరా చేస్తుందని, ఎలాంటి అవకతవకలు జరగకుండా పౌర సరఫరా శాఖ అధికారులు చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. వాకాడు మండల్ లెవెల్ స్టాక్ పాయింట్ కింద వున్నా కోట వాకాడు చిట్టమూరు డీలర్ షాపులులో రేషన్ తగ్గితే ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఈ స్టాక్ పాయింట్‌కు ఆలస్యం కలగకుండా ఇచ్చిన సమయంలోనే ప్రతినెల రేషన్ వచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు, స్టాక్ పాయింట్‌లో పనిచేస్తున్న ఆమాలీలలు జీతాలు సక్రమంగా రావడం లేదని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా జీతాలు ప్రతినెల అందేలా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. అనుమతులు లేని వాహనాల్లో స్టాక్ పాయింట్ వద్ద రేషన్ సరఫరా చేస్తున్నారని విలేకరులు అడిగిన ప్రశ్నకు జిల్లా కలెక్టర్ స్పందించి జాయింట్ కలెక్టర్ ,సబ్ కలెక్టర్ లు వచ్చి దర్యాప్తు నిమిత్తమేరకు చర్యలు తీసుకుంటానన్నారు. ఆయన వెంట గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తాసిల్దార్ రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, డిప్యూటీ తాసిల్దారులు సందీప్ కుమార్, మల్లికార్జున రావు, స్టాక్ పాయింట్ డిటి వెంకటేశ్వర్లు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్, వీఆర్వోలు కాటమ్మ, శ్రీనివాసులు, పోలయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఘనంగా జరిగిన హనుమాన్ శోభాయాత్ర

వెంకటగిరి, మే 22, ప్రభాతవార్త



హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణ పురవీధుల్లో హనుమాన్ శోభాయాత్ర ఘనంగా జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ నుండి శోభాయాత్ర ప్రారంభమై రాజు వీధి తూర్పు వీధి ప్రాంతాల్లో నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కోట సునీల్ కుమార్ శర్మ మాట్లాడుతూ హనుమాన్ శోభాయాత్రకు భారీగా ప్రజలు తరలివచ్చారని తెలిపారు. హనుమంతుడు గొప్ప బలశాలని హనుమంతుని ఆశీస్సులు అందరికి ఉండాలని తెలిపారు. హిందూ బంధువులందరూ హనుమాన్ శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు. హనుమంతుని చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ నాయకులు అలిమేలి మల్లికార్జున, వడ్లమూడి భాస్కర్, గుండు మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం : ఎమ్మెల్యే కురుగొండ్ల



వెంకటగిరి, మే 22, ప్రభాతవార్త

గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని ఒక కళ్యాణ్ మండపంలో మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రం ఎంతగానో వెనుకబడిందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విజన్ ఉన్న మంచి నాయకుడని తెలిపారు. డిసిసి ఛైర్మన్ మెట్కూరు ధనుంజయ రెడ్డి చెప్పిన సోమశిల సొన్నముఖి కెనాల్, ఆల్తూరుపాడు రిజర్వాయర్ వంటి అభివృద్ధి పనులను కూడా సీఎం దృష్టికి తీసుకెళ్తారని తెలిపారు. మాధవ నాయుడు మాట్లాడుతూ ఎన్టీ రామారావు పార్టీని స్థాపించి 9 నెలల్లోనే పార్టీ స్థాపించి అధికారంలోకి తీసుకువచ్చారని చెప్పారు. డిసిసి ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే రాష్ట్రం అభివృద్ధి బాటలో పడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో డిసిఎంఎస్ ఛైర్మన్ జి నాగేశ్వరరావు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్ని రమణయ్య, మాజీ ఏఎంసీ ఛైర్మన్లు రాజేశ్వరరావు,సిసి నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి,చంద్రమౌళి రెడ్డి, రాయ్ మస్తాన్ నాయుడు, గంగాధర్, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు కె వి కె ప్రసాద్ నాయుడు,నాయకులు విశ్వనాథం, ఆనంద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నాపై కక్షతోనే జామాయిల్‌తోటను తగలపెట్టారు ...

నాయుడుపేట, మే 22 ప్రభాతవార ్త;

నాపై కక్షసాదించి నన్ను ఆర్థికంగా ఇబ్బంది పెట్టేందుకే నేనుసాగుచేస్తున్న జామాయిల్‌తోటలో నిప్పంటించి తగలపెట్టారని భాధితుడు వల్లిపి వెంకటయ్య ఆరోపించారు.సేకరించిన సమాచ్చారం మెరకు వివరాలిలా ఉన్నాయి.మండలంలోని వడ్డికండ్రిగ గ్రామానికి చెందిన వల్లిపి వెంకటయ్య పూలతోట రెవెన్యూ పరిదిలోని సర్వేనెంబరు 324-2పిలో సమారు 5ఎకరాల్లో గతరెండు సంవత్సరాల నుండి జామాయిల్‌ను సాగు చేపడుతున్నాడు.ఈక్రమంలో వడ్డికండ్రిగ గ్రామానికి చెందిన వల్లిపి పెద్దరమణయ్య,శివకుమార్‌లు పాతకక్షలు మనస్సులో పెట్టుకొని నాపొలంలో ఎవ్వరులేని సమయంలో జామాయిల్‌తోటలో నిప్పంటించి తగలపెట్టారని భాధితుడు పోలీసులకు పిర్యాదు చేశాడు.జామాయిల్‌తోటలో వాటర్‌తోలేందుకు వేసిన ప్లాస్టిక్‌పైపులు కూడ మంటల్లో కాలిపోయినట్లు తెలిపారు.జామాయిల్‌తోటను తగలపెట్టడం వల్లన సుమారు 10లక్షల వరకు నష్టం జరిగినట్టు భాధితుడు వెంకటయ్య వాపోయాడు.

# గూడూరు డివిజన్

## కోటలో హనుమజ్జయంతి వేడుకలు



కోట, మే 22 ప్రభాతవార్త

కోట పట్టణంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా గురువారం ఆలయ ధర్మకర్త కొడవలూరు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు ఆలయ ప్రాంగణం నుంచి ద్విచక్ర వాహనాలతో కోట పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కెఎస్ఆర్ సేవాసంస్థ ఛైర్మన్ మంగాపురం రమేష్‌బాబు, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే శ్యామసుందరపురంలో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు.

## అంతర్జాతీయ సంబంధాలు పుస్తకం ఎమ్మెల్యేచే ఆవిష్కరణ

వెంకటగిరి, మే 22 ప్రభాతవార్త



డాక్టర్ సురేష్ కుమార్ రెడ్డి రచించిన అంతర్జాతీయ సంబంధాలు అనే పుస్తకాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ పుస్తకం ద్వారా అంతర్జాతీయ సంబంధాలు ఏ విధంగా ఉండాలని విషయాలను అందరూ తెలుసుకోవచ్చని ఎమ్మెల్యే అన్నారు. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యేందుకు సురేష్ కుమార్ గిండి ఐఎఎస్ అకాడమీ ద్వారా ఆయన కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ సంబంధాలు అనే పుస్తకం ఎంతగానో సివిల్స్ ప్రిపేర్ అయ్యేందుకు ఉపయోగపడుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంసీ ఛైర్మన్లు రాజేశ్వరరావు, సీసీ నాయుడు, డాక్టర్ సుమన్, దొంతు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

గూడూరు, మే 22, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణ మరియు చుట్టుపక్కల గ్రామాల నుండి అనేకమంది ప్రజలు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు వారికి మందులు అద్దాలు ఉచితంగా అందజేశారు. సంస్థ ఏవో కృష్ణ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా నెల్లూరు తిరుపతి జిల్లాలో అనేక సేవా కార్యక్రమాల నిర్వహిస్తున్నామని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నిరంజన్‌రెడ్డికి ప్రముఖుల నివాళి



కోట, మే 22 ప్రభాతవార్త

కోట మండలం కొక్కుపాడు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త యరటపల్లి నిరంజన్‌రెడ్డి గురువారం గుండెపోటుతో విశాఖపట్నంలో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని గురువారం స్వగ్రామమైన కొక్కుపాడుకు తీసుకొచ్చారు. ఆయన ప్రముఖ రాజకీయ నాయకుడు యరటపల్లి మధుసూదన్‌రెడ్డి సోదరుడు. ఆయన మృతదేహానికి రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పుచ్చలపల్లి జలసంఘం మాజీ అధ్యక్షుడు దువ్వూరు వెంకటరమణారెడ్డి, దువ్వూరు రఘురామిరెడ్డి, పార్టీలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు నివాళి అర్పించారు. ఆయన భౌతికకాయాన్ని చివరిసారిగా చూసేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. నివాళి అర్పించిన వారిలో సిద్దవరం సొసైటీ మాజీ ఛైర్మన్ పాదర్తి రాధాకృష్ణారెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యులు ఉప్పల ప్రసాద్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## నేత్రదాన మహోద్యమంలో 464వ నేత్రదాత

తడ, మే 22 ప్రభాతవార్త



సూళ్లూరుపేట ప్రాంతంలో జరుగుతున్న నేత్రదాన మహోద్యమంలో భాగంగా 464వ నేత్రదాతగా తడ మండలం గొల్లలమొలువుకు చెందిన ఈశ్వరవాక రత్నమ్మ (84) తన మరణానంతరం కార్నియాలను వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో సేకరించి చెన్నై శంకర నేత్రాలయ వారికి అందజేశారు. సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవాసంస్థ వారి ఆధ్వర్యంలో ఈ నేత్రదాన మహోద్యమం జరుగుతోంది. ఈశ్వరవాక రత్నమ్మ మరణించినప్పటికీ ఆమె ద్వారా సేకరించిన నేత్రాలు ఇద్దరి శరీరాల్లో జీవించే ఉంటారని భరద్వాజ సేవాసంస్థ ప్రతినిధులు తెలిపారు.

## తమకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు వినతి

గూడూరు, మే 22, ప్రభాతవార్త

గూడూరు రూరల్ నెలటూరు చోట గిరిజన కాలనీకి చెందిన బల్లోలు వెంకటేశ్వర్లు తొమ్మిది సంవత్సరాల బాలుడు సత్యవేడులో అదృశ్యమై కంచిలో శవమైనాడు. ఈ అబ్బాయిని సత్యవేడుక చెందిన బాతులు కలిగిన ఒక రైతు దగ్గర ఈ అబ్బాయి తల్లి కొద్ది మొత్తం డబ్బులు తీసుకుని బాతులు మేపడానికి అతని దగ్గర ఉంచింది. అతను ఈ అబ్బాయిని చంపి కంచిలో పాతి పెట్టడం జరిగింది. అది ఏమని తల్లిదండ్రులు అడిగితే జాండీస్ వచ్చి చనిపోయినాడు అని సమాధానం చెప్పాడు. ఈ కేసును తిరుపతి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ మెంబర్స్ అయినటువంటి ఏసుబాబు పెంచలయ్య ఆరవపార్వతయ్య , దాసరి వెంకటేశ్వర్లు అందరూ కలిసి సత్యవేడు సిఐకి ఎస్ఐకి సమస్యను వివరించి జిల్లా ఎస్పీ ద్వారా ఈ కేసును ఎఫ్ ఐ ఆర్ చేయించడం జరిగింది. సంబంధిత ఈ హత్యకు కారణమైన బాతులు కలిగిన వ్యక్తిపై చైల్డ్ లేబర్ బాండింగ్ లేబర్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ తదితర కేసులు సత్యవేడు సిఐ అతనిపై నమోదు చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులైన మేము మర్డర్ కేసు అతనిపై నమోదు చేయాలని, ఈ బాలుడు తల్లిదండ్రులకు మూడు నెలలపాటు నిత్యవసర సరుకులు కొంత ఆర్థిక సహాయం చేయమని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రని కలిసి వినతి పత్రంలో కోరారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్దుడు మృతి

నాయుడుపేట, మే 22 ప్రభాతవార్త ;

గుర్తుతెలియని వాహనం డీకొని ముద్ద రవికుమార్(65)అనే వృద్దుడు మృతిచెందిన సంఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. నాయుడుపేట పట్టణం ఆర్ముగంనగర్‌కు చెందిన ముద్ద రవి కుమార్‌కు కళ్ళు సరిగా కనపడకపోవడంతో శ్రీకాళహస్తీ కార్తీకేయ హోటల్ సమీపంలో రోడ్డుపై అటుఇటూ తిరుగుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ప్రమాదవశాత్తు రవికుమార్‌ను డీకొంది.దీంతో రవికుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. నాయుడుపేట పోలీసులు సంఘటనా స్థలంకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పంచనామనిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు

## భక్తులకు లడ్డు పంపిణీ: వాడవాడల్లో అన్నదానాలు

శ్రీకాళహస్తి,మే 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం సతీసమేతంగా శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి హాజరయ్యారు. ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద వారికి డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి సారథ్యంలో వేద పండితులు ఆలయ పౌరోహితులు అర్ధగిరి, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్స్ స్వాగతం పలికారు. వేదపండితులు శివప్రసాద్‌శర్మ,మారుతీ శర్మలు వేదమంత్రాలను పఠిస్తుండగా స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్నారు.తరువాత వారికి ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.తరువాత సుధీర్‌రెడ్డి దంపతులు భక్తుల ఆశీర్వచనాలను అందుకున్నారు.ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ భక్తులకు లడ్డు ప్రసాదాలను పంపిణి చేసారు.

**పార్టీ కార్యాలయంలో సంబరాలు:**

శ్రీకాళహస్తి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కొత్త(పాత) పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు సారథ్యంలో భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు.ఇక్కడ ద్వితీయ శ్రేణి నాయకులు పోటీలు పడి కేక్‌లు ఏర్పాటు చేసి కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాగా తిరుపతి పార్లమెంటు ఎస్‌టి సెల్ అధ్యక్షులు సుబ్బయ్య సారథ్యంలో కేక్ కట్ చేయించారు. సుధీర్‌రెడ్డిని పూల మాలలు,దుశ్శాలువలతో సత్కరించారు. విజయకుమార్ సారథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో గాలి చలపతి నాయుడు, గాలి మురళినాయుడు,నెమళ్ళూరు బుజ్జి,జయచంద్రనాయుడు,కె.వి ప్రతాప్ నాగరాజురెడ్డి,పోలూరు శ్రీనివాసులురెడ్డి దశరదాచ్చారి.ఢిల్లి బాబు,ఉమేష్‌రావు,జావిద్ మస్తాన్,జిలాని,షాకీర్ అలి,బిజెప్రసాద్,ఎంఎస్ రెడ్డి,సుమతి,రేణుకాదేవి, బిజెపి నాయకుడుచంద్రప్ప అధికారులు అనధికారులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలుతెలిపారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులకు ఉచితంగా లడ్డు ప్రసాదాలను అందిస్తున్న ఎంఎల్‌ఏ, అన్నదానం జరుపుతున్న దృశ్యం

**వాడ వాడల్లో అన్నదానాలు:**

శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా వాడ వాడల్లో సామాజిక కార్యక్రమాల్లో భాగంగా అన్నదానాలు జరిపారు.పెళ్ళి మండపం వద్ద కాసరం రమేష్ సారథ్యంలో భారీ ఎత్తున అన్నదానం జరిపారు. రాజీవ్‌నగర్‌లో గురవయ్య, సురేష్ సారథ్యంలో అన్నదానం జరిపారు. బంగారమ్మగుడి సమీపంలోని కైలాసగిరికాలనీలో పట్టణ పార్టీ అధ్యక్షులు సుమతి సారథ్యంలో అన్నదానం జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆమెతో పాటు బాబురెడ్డి,మీర్జాలు సహకరించారు. బిక్షాల గాలిగోపురం వద్ద మాజీ కౌన్సిలర్ మునికృష్ణయ్య సారథ్యంలో అన్నదానం జరిపారు. అగ్రహారం మలుపు వద్ద 32వ వార్డుతెలుగుదేశం నాయకులు ఎస్‌కె షఫీ సారథ్యంలో అన్నదానం ఏర్పాటు చేసారు. మిట్ట కండ్రిగ వద్ద బాబు రైసు మిల్లు వద్ద అన్నదానం జరిపారు.ఈ కార్యక్రమాల్లో బొజ్జల రిషితారెడ్డి పాల్గొన్నారు.

## పవన పుత్ర పాహిమాం

చౌడేపల్లి, మే 22 ప్రభాతవార్త: హనుమ జయంతి సందర్భంగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితుడు సత్యనారాయణశర్మచే ఉదయాన్నే స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. సాయంత్రం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగించారు. రాత్రి ఆలయ ధ్వజస్తంభంపై జ్యోతిని నెలకొల్పారు. టిటిడి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా స్థానిక హరిమందిరం, గడ్డంవారిల్లి, , పుదిపట్ల వైష్ణవీదేవీ ఆలయం, నడుమూరు తదితర ప్రాంతాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వినాయక యువజన కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## జపాలి ఆంజనేయస్వామి పూజల్లో యువభారత్‌ఛైర్మన్ వైద్యప్రవీణ్‌కుమార్



తిరుమల,మే 22ప్రభాతవార్తప్రతినిధి:

హనుమాన్‌జయంతి రోజున గురువారం ఉదయం శేషాచల కొండల్లోని జపాలిలో కొలువైన ఆంజనేయస్వామి ఆలయంలో యువభారత్‌ఛైర్మన్,నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీ అధికారప్రతినిధి వైద్యప్రవీణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జపాలి తీర్థం మహంతు ఓంప్రకాశ్‌దాస్‌తో కలసి హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు.హోమాలు జరిపించారు. తీర్థం ప్రత్యేకత గురించి తెలుసుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రీనివాసరెడ్డి, తిరుమల 2టౌన్‌సిఐ రాముడు, ఎర్రమోతు సోము ,వేలూరు మురళి పాల్గొన్నారు.